క్లుప్తంగా

అయ్యప్ప ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న అయ్యప్ప భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక బాహుదానది పరివాహక ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప ఆలయానికి కొళిగాంకు చెందిన అయ్యప్ప భక్తులు రూ.30,063 విరాళంగా అందజేశారు. కొళిగాం గ్రామానికి చెందిన లోపింటి శ్రీనివాసరావు, గురుస్వామి జి.దుర్యోధనల ఆధ్వర్యంలో అయ్యప్ప సన్నిధానం ఏర్పాటు చేసి ఇటీవల శబరిమల వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ఖర్చులు మినహాయించి మిగిలిన సొమ్మును గురువారం ఆలయ గురుస్వామి భవత్తి శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు చలపతి, కుమారస్వామి, కోటీష అజిత్ మహారణ, కృష్ణారావు, హరీఫ్, సురేష్, వెంకట్, అన్వేష్, కామేష్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడల్ని ప్రోత్సహించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ఇచ్ఛాపురం రూరల్: గ్రామీణ క్రీడల్ని ప్రోత్సాహించడం ద్వారా మారుమూల ప్రాంత క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయవచ్చని ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ కె.రామకృష్ణ అన్నారు. కొఠారీ కమలాక్షి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కొఠారీ గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రో కబడ్డీ పోటీలను ఎస్ఐ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, కొల్లెర్ల యాదవరెడ్డి, సాడి సహదేవ్‌రెడ్డి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

26న క్విజ్ పోటీలు

కంచిలి: మండలంలోని గోకర్ణపురంలో రిపబ్లిక్ డే పురస్కరించుకుని ఈ నెల 26న క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఈ పోటీలకు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, వివరాలకు 9701702826, 9493577544 నంబర్లను సంప్రదించాలని సూచించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున నగదు, షీల్డులు అందజేస్తామని పేర్కొన్నారు. ఎటువంటి వయో పరిమితి లేదు, జట్టుకు నలుగురు సభ్యులు మాత్రమే ఉండాలని తెలిపారు.

పేదలకు సాయం



దానం చేస్తున్న తిరుపతిరెడ్డి దంపతులు

మందస: సంక్రాంతి సందర్భంగా మందస పట్టణంలోని పలువురు పేదలకు గురువారం షిరిడిసాయి ధ్యానమందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గిన్ని తిరుపతిరెడ్డి, లోకేశ్వరి దంపతులు స్టీల్ ప్లేట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ నవీన్, బంగారు బాబూరావు, కొండపల్లి వల్లభరావు, బోయిన శ్రీను పాల్గొన్నారు.

పక్కాగా ధాన్యం సేకరణ



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జయంతి

సోంపేట: జిల్లాలో కనీస మద్దతు ధరకు ఖరీఫ్ ధాన్యం సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ఎం.జయంతి అన్నారు. సోంపేట మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను గురువారం పర్యవేక్షించి వ్యవసాయ శాఖ అధికారి బి.నరసింహమూర్తితో సమీక్షించారు. అనంతరం పలు రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర పొందాలన్నారు.

అనాథల సేవకుడికి సత్కారం



అనేకచిన్నికృష్ణను సత్కరిస్తున్న సభ్యులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని లలిత అనాథ శరణాలయ నిర్వాహకుడు సువ్వారి చిన్నికృష్ణను మొగిలిపాడులో గురువారం సన్మానించారు. చిన్నికృష్ణ అనేక మంది అనాథలు, వృద్ధులకు ఆశ్రయం కల్పించడమే కాకుండా పలు అనాథ మృతదేహాలకు దహన సంస్కారాలు చేయించారు. ఈ నేపథ్యంలో అభ్యుదయ యువజన సంఘం ప్రతినిధులు వార్షిక కార్యక్రమంలో భాగంగా చిన్నికృష్ణ సేవలను కొనియాడి సత్కరించారు.

నేడు బొడ్డపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

పలాస: బొడ్డపాడు పంచాయతీలో శుక్రవారం ఉదయం 10 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పైల చిట్టి ఒక ప్రకటనలో తెలిపారు.

వారంలోగా సాంకేతిక సమస్యలు పరిష్కారం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి సీదిరి అప్పలరాజు



26వ వార్డులో స్థానికుల సమస్యలు వింటున్న మంత్రి సీదిరి అప్పలరాజు, నాయకులు

కాశీబుగ్గ: సాంకేతిక సమస్యతో కొన్ని పథకాలు తాత్కాలికంగా ఆగాయని, వారం రోజుల్లో పరిష్కరించి తిరిగి అందిస్తామని రాష్ట్ర పశు సంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 26వ వార్డులో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి తంగుడు కనకరాజు అధ్యక్షతన గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుమారు 400 గృహాలకు వెళ్లి పథకాల లబ్ధిని, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో వారంరోజులు పాటు ప్రత్యేక సవరణలు జరుగుతున్నాయని, పథకాలు నిలిచిపోయిన వారంతా తగినన్ని ఆధారాలు సమర్పిస్తే తిరిగి పొందవచ్చన్నారు. తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని హితవుపలికారు. వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.3 లక్షల విలువైన పవర్ బోర్లు మంజూరు చేస్తామని చెప్పారు. వార్డులోసమస్యలు పరిష్కారానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ పి.వి.సతీష్, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, ప్రభుత్వ విప్ శంకర్ పండా, కౌన్సిలర్లు బోర చంద్రకళారెడ్డి, బెల్లాల శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, బడగల బళ్లయ్యనాయుడు, టి.కె.శ్రీనివాసరావు, మల్లా భార్గవ్, మల్లా భాస్కర్, మల్లా కామేశ్వరరావు, ఉపేంద్ర, గిరీష్, అంధవరపు మధు, దున్న సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ ఫలాలు



వృద్ధురాలికి జగనన్న కంటి వెలుగు ద్వారా మంజూరైన కళ్లద్దాలు అమర్చుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

నందిగాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ఇంటికి పెద్ద కుమారుడిలా వ్యవహరిస్తూ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. గురువారం నందిగాం మండలం పెద్దతామరాపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రెల్లివీధిలో ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్లలో కలిగిన పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ప్రభుత్వం అందిస్తున్న పథకాల సొమ్ములు తమ ఖాతాల్లోకి వస్తున్నా స్థానిక ఆంధ్రా బ్యాంకులో తమకు ఉన్న రుణాలకు జమ చేస్తున్నారని వాపోయారు. దీనిపై ఎమ్మెల్సీ స్పందించి బ్యాంకు మేనేజర్‌ను ఫోన్‌లో సంప్రదించి ప్రభుత్వం అందిస్తున్న పథకాల సొమ్ములు వారికి ఇవ్వాలని సూచించారు. రుణాలు సకాలంలో చెల్లించాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం విద్యుత్, డ్రైనేజీ, పాస్ పుస్తకాల సమస్యలను స్థానికులు విన్నవించగా.. ఎమ్మెల్సీ ఆయా అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ తమిరె సుధారాణి దేవేంద్ర, ఎంపీటీసీ సైలాడ లావన్న, నాయకులు టొంప రామారావు, తమిరె బలరాం, తమిరె ఫల్గుణరావు, రేగల కూర్మారావు, పోలాకి మోహనరావు, నాగా రామారావు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పారిశుద్ధ్య పరికరాలు మంజూరు

కోటబొమ్మాళి: మండలంలోని 38 పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, మరుగుదొడ్ల క్లీనింగ్‌కు పరికరాలు మంజూరైనట్లు ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ గురువారం తెలిపారు. ఫాగింగ్ యంత్రాలు, హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్లు, ఇన్సినరేటర్లు మంజూరయ్యాయని, త్వరలోనే పంచాయతీ కార్యదర్శులకు అందజేస్తామని పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

కాశీబుగ్గ: పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు కాముటివీధిలో ఉప్పాడ గంగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన సభార్య ఉప్పాడ జగదీశ్వరికి వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను గురువారం మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, వార్డు కౌన్సిలర్ బోర చంద్రకళారెడ్డి అందజేశారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

కోటబొమ్మాళి: మండలంలోని వాంగ్రాడ గ్రామానికి చెందిన వివాహిత(43) బుధవారం నుంచి కనిపించడం లేదని ఆమె కుమారుడు కోటబొమ్మాళి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. పెద్ద బమ్మిడిలోని చుట్టాలింటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదని పేర్కొన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా తెలిపారు.

జగనన్న గోరుముద్దతో మేలు



భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ చాందిని

కోటబొమ్మాళి: జగనన్న గోరుముద్ద పథకంతో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందుతోందని గొండు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు గొండు మురళీ, సర్పంచ్ గొండు చాందిని అన్నారు. దంత ప్రాథమికోన్నత పాఠశాలలో గొండు చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయంతో రూ.4 లక్షలతో పునర్నిర్మించిన భవనాన్ని గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ లావేటి సింహాచలం, హెచ్‌ఎం జి.నారాయణరావు, ఉపాధ్యాయులు జగన్మోహనరావు, రమణ, జ్యోతి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షకు పటిష్ట బందోబస్తు

కోటబొమ్మాళి/కాశీబుగ్గ: ఈ నెల 22న జరగనున్న పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ రాధిక టెక్కలి ఇన్‌చార్జి డీఎస్పీ జి.శ్రీనివాసరావును ఆదేశించారు. గురువారం కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కళాశాల, వంశధార, విక్టరీ కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా, ప్రిన్సిపాల్స్ చింతాడ అనిరుద్రుడు, ప్రసాద్ పాల్గొన్నారు. కాశీబుగ్గలో సూర్యతేజ డిగ్రీ కళాశాలతో పాటు మరో ఆరు పరీక్ష కేంద్రాలను ఏఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు పరిశీలించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సీఐ జి.శ్రీనివాసరావు, అంబేడ్కర్ యూనివర్శిటీ పాలకమండలి సభ్యురాలు దానేటి పద్మజ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నందిగాం: పెద్దతామరాపల్లిలో తమిరె షణ్ముఖరావు సోదరుడు తిరుపతిరావు మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను,సుభద్రాపురంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యర్ర జగదీశ్వరరావు కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ గురువారం పరామర్శించారు.

ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

వజ్రపుకొత్తూరు: అమలపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని ఎంపీడీఓ సీహెచ్.ఈశ్వరమ్మ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దున్న రత్నంబాలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు డి.ఢిల్లీరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ మోటార్ పథకం పరిశీలన

కంచిలి: నువాగడ పంచాయతీ రాధాశాంతినగర్, కుంబరినౌగాం పంచాయతీ సింగుపురంలో పాడైన సోలార్ మోటార్ మినీ రక్షిత నీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పి.ఎల్.వి.ప్రసాద్ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో నువాగడ సర్పంచ్ సబితా గొమాంగో పాల్గొన్నారు.

పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు



యంత్రాలను అందజేస్తున్న ఎంపీపీ

వజ్రపుకొత్తూరు: పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు, పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన సామగ్రిని గురువారం ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, ఎంపీడీఓ సీహెచ్.ఈశ్వరమ్మ, ఈఓపీఆర్‌డీ డి.తిరుమలరావు, వైస్ ఎంపీపీ వంక రాజు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు, సైనూరు సర్పంచ్ అట్టాడ గోవిందరావు పాల్గొన్నారు.

గ్రామ సారథుల ఎంపిక



కొత్తపేటలో గ్రామసారథులను ఎంపిక చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో గ్రామ సారథుల నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్లు కోటబొమ్మాళి సచివాలయాల కన్వీనర్ల మండల ఇన్‌చార్జి గెద్దవలస నాగభూషణరావు తెలిపారు. గురువారం కొత్తపేట, అక్కయ్యవలస సచివాలయాల పరిధిలో గ్రామ సారథుల ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపేట వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, సర్పంచ్ రాంపాత్రుని సావిత్రి, అక్కయ్యవలస సర్పంచ్ సుంకరి జనార్దన, మండల కోఆప్షన్ సభ్యుడు రంజాన్ రాజూబాయ్ పాల్గొన్నారు.

కల్వర్టు పునర్నిర్మాణానికి శంకుస్థాపన నేడు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో సంతోషిమాత ఆలయం వద్ద వరద నీటి సమస్య పరిష్కారంలో భాగంగా కల్వర్టు పునర్నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శంకుస్థాపన చేయనున్నారు.

బడుల బలోపేతానికి కృషి

కవిటి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమానికి ప్రభుత్వ ఉపాధ్యాయుల కృషి జోడిస్తే విద్యాభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతుందని ఎంఈఓ ధనంజయమజ్జి అన్నారు. గురువారం బొగిడియాపుట్టుగ ప్రాథమిక పాఠశాలను సందర్శించి బాలబాలికల హాజరును పరిశీలించారు. విద్యార్థులు చక్కని ఆంగ్ల నైపుణ్యాలు కలిగి ఉండటంతో ఉపాధ్యాయుడు కొత్తపల్లి రంగారావును ప్రత్యేకంగా అభినందించారు. మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మకరాంపురం విద్యార్థులు



పి.సాయికిరణ్



కె.వినోద్

కంచిలి: జిల్లా కేంద్రంలో ఆర్ట్స్ కళాశాల వేదికగా ఈ నెల 20 నుంచి 22 వరకు జరగనున్న 66వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు మకరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పి.సాయికిరణ్ అండర్–14 షార్ట్ పుట్ విభాగంలో, కె.వినోద్ అండర్–17 హైజంప్‌లో ప్రతిభ కనబర్చారు. దీంతో వీరిద్దరినీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు వజీర్ తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

మహేంద్రగిరిపై జాతీయ జెండా రెపరెపలు



జెండాను ఎగురవేస్తున్న సున్నాదేవి యువకులు

కాశీబుగ్గ/పలాస: పలాస మండలం సున్నాదేవి గ్రామ యువకులు ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లోని మహేంద్రగిరి పర్వతంపై జాతీయ జెండాను ఎగురవేశారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం, ఉపాధి, చదువులు కొనసాగిస్తున్న వారంతా సంక్రాంతికి స్వగ్రామం విచ్చేసిన సందర్భంగా గురువారం సముద్ర మట్టానికి 4925 అడుగుల ఎత్తులో భీముని ఆలయం వద్ద జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి 33/11కేవీ సబ్‌స్టేషన్ అమలపాడు ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని టెక్కలి ఈఈ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. లీనింగ్ పోల్స్, డీటీఆర్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త సాయిరాజ్

- గడపగడపకు మన ప్రభుత్వంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్

కవిటి: రాష్ట్రంలో అద్భుత పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలపక్షపాతిగా నిలిచారని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. గురువారం కవిటి–2 సచివాలయం పరిధిలోని 8, 9, 10, 13 వార్డుల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా కలిగిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. రాజకీయాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్న విషయాన్ని ప్రజలంతా గుర్తించాలన్నారు. అర్హతలు ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, దుక్క లోకేశ్వరరెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎంపీటీసీలు పి.నీలాచలం, మానేక శంకర్‌ప్రధాన్, బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్, వైఎస్సార్‌సీపీ నేతలు దుద్ది ధర్మారావు, పినింటి జయరావు, పినింటి శ్రీనివాస్, బి.తిరుమల, ఢిల్లేశ్వరరావు, బి.శ్రీరాం, తులసి, కేశవరావు, నూతలపాటి బాబూరావు, ఎంపీడీఓ పి. సూర్యనారాయణ, పంచాయతీ ఈఓ జి.వీరభద్రస్వామి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో వలసల నివారణ



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటరావు, ఎంపీడీఓ తిరుమలరావు

మందస: ఉపాధి హామీ పనులతో వలసల నివారణ సాధ్యమవుతుందని మూలిపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత గుసిరి వెంకటరావు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, ఈఓపీఆర్డీ ఐ.వి.రమణ అన్నారు. మందస మండలం మూలిపాడు పంచాయతీలోని పెద్దచెరువు వద్ద ఉపాధి హామీ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ పనులు అనంతరం కూలీలకు ఉపాధి లేకపోవడంతో వలసలు వెళ్తుంటారని, వీటిని నివారించేందుకే ఖరీఫ్ పనులు ముగిసిన తక్షణమే ఉపాధి పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులు చేసుకోవాలని కోరారు. మండలంలో ముందుగా మూలిపాడులోనే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ తెలుకుల మురళీ, నాయకులు పిట్ట భీమారావు, తెలుకుల బుదియాసాహు, తెంబ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పథకం ప్రారంభం



కవిటికొత్తూరులో కుళాయిలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్

కవిటి: మండలంలోని కవిటికొత్తూరులో గురువారం మంచినీటి కుళాయి పథకాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ప్రారంభించారు. గ్రామ పంచాయితీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సుమారు రూ.2.50 లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపీటీసీ ఎ.హేమలత, మానేక శంకర్‌ప్రధాన్, పి.నీలాచలం, నాయకులు పి.జయరావు, పి.శ్రీనివాస్, బార్ల తిరుమలరావు, ఎర్రఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా తాగునీటి కల్పనే ధ్యేయం



పాలవలసలో తాగునీటి పనులకు శంకుస్థాపన చేస్తున్న పేరాడ తిలక్

నందిగాం: ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. గురువారం నరేంద్రపురం పంచాయతీ పాలవలసలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి ఇంటింటికి తాగునీటి సౌకర్యం కల్పించే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చిలోగా అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కురమాన బాలకృష్ణారావు, సర్లాన బైరాగి, వైస్ ఎంపీపీ సువ్వారి వసంత్‌కుమార్, నాయకులు రేగల కూర్మారావు, తమిరె ఫల్గుణరావు, అంబోడి విష్ణు, బొమ్మాళి గున్నయ్య, మడపాల సంజీవరావు, పూడి ఆశారాణి, తమిరే రాజు, కింతలశేషగిరి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. గురువారం పురపాలక కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక పథకాలను అమలు చేస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. సకాలంలో రుణాలను చెల్లిస్తే రుణమాఫీ వర్తిస్తుందన్నారు. అనంతరం మూడు రాజధానుల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది బాలరాజు, సంతోష్, ఆర్పీలు పాల్గొన్నారు.

యోగి వేమనకు ఘన నివాళి

తేట తెలుగు పదాలతో సామాన్యులకు అర్థమయ్యేలా పద్య రచనలు చేసి సమాజాన్ని జాగృతం చేసిన మహానుభావుడు యోగి వేమన అని వక్తలు కొనియాడారు. యోగి వేమన జయంతి సందర్భంగా గురువారం కార్యాలయాలు, విద్యాసంస్థలు, సంఘ భవనాల ఆవరణల్లో వేమన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డిక సంఘం ప్రతినిధులు



ఇచ్ఛాపురం రూరల్: వేమన చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీడీఓ రామారావు, కారంగి మోహనరావు



పలాస: వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు



సంతబొమ్మాళి: వేమన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జెడ్పీటీసీ వసంతరెడ్డి



కవిటి: ముత్యాలపేటలో వేమనకు నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం తమ్మయ్య, సిబ్బంది



టెక్కలి: యోగి వేమనకు నివాళులు అర్పిస్తున్న రెడ్డి ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు